# సత్య వాక్య

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

ఇంగ్లీషు THE VOICE OF TRUTH

సోమవారము 9-00 to 9-15 p. m.
బుధవారము 9-30 to 9-45 a. m.

హింది — SATYA SUSAMACHAR

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 p. m.
ఆదివారము — 1-30 to 1-45 p. m.

తమిళం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము, శుక్రవారము — 6-45 to 7-00 p. m.

మలయాళం — THE VOICE OF TRUTH

మంగళవారము, శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

**SATYA VANI**
**P.O. Box. 80**
**KAKINADA – 533 001**

రాజన్ ఎంక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

**Pleading for restoration of pure New Testament Christianity.**

సంచిక **12** జూలై **1983** సంపుటి **3**


## సంపాదకీయము

### ఎవరు బాప్తిస్మ మియ్యవలెను?

### *( Who Should Baptize ? )*

యోహాను 4:1-3 లో మనం ఇట్లు చదువగలము : "యోహాను కంటె యేసు ఎక్కువమందిని శిష్యులనుగా చేసికొని వారికి బాప్తిస్మ మిచ్చుచున్న సంగతి పరిసయ్యులు వినిరని ప్రభువునకు తెలిసినప్పుడు ఆయన యూదయ దేశము విడిచి గలిలయ దేశమునకు తిరిగి వెళ్ళెను". ఈ లేఖనభాగము నుండి కొన్ని ప్రశ్నలు వెంటనే మనకు రావచ్చును. యోహానుకంటె యేసు ఎక్కువమందికి బాప్తిస్మ మిచ్చెనని పరిసయ్యులు వినిరని చెప్పబడింది. ఈ యోహాను బాప్తిస్మ మిచ్చు యోహాను, క్రీస్తుకంటె ముందుగా వచ్చినవాడు. క్రీస్తు రాకడకు ఆయన రాజ్యముకు ప్రజలను సిద్ధపరచుట కొరకు అతడు మారుమనస్సు, బాప్తిస్మము ప్రకటించుచు వచ్చాడు. గనుక ప్రజలందరు సాధారణంగా యోహాను ఇచ్చే బాప్తిస్మాన్ని గూర్చి యెరిగినవారే, గాని ఇప్పుడైతే యోహానుకంటే యేసు ఎక్కువ మందికి బాప్తిస్మ

మిచ్చినట్లు వినబడుచున్నది. క్రీస్తు వ్యక్తిగతంగా ఎవరికీ బాప్తిస్మ మియ్యక పోయినను, ఆయన శిష్యులే బాప్తిస్మ మిచ్చేవారు. యేసే వ్యక్తిగతంగా ఎందుకు బాప్తిస్మ మియ్యలేదు? బాప్తిస్మము ప్రాముఖ్యము కాదని దీని యర్థమా? అట్లయితే యోహాను ఎందుకు బాప్తిస్మ మిచ్చుచుండెను? శిష్యులు బాప్తిస్మ మెందుకు ఇచ్చారు? దీన్ని గూర్చి క్రీస్తుకు తెలీదా? ఆ యధికారాన్ని ఆయనే వారి కీయలేదా? తప్పకుండా ఆయనకు తెలుసు. ఆ యధికారాన్ని ఆయనే వారి కిచ్చాడు. అయితే బాప్తిస్మం ప్రాముఖ్య మయితే క్రీస్తే స్వయంగా ప్రజలకు ఎందుకు బాప్తిస్మ మియ్యలేదు?

ఇంతకు ముందు చెప్పిన విధంగా, క్రీస్తు బాప్తిస్మ మిచ్చే అధికారాన్ని తన శిష్యుల కిచ్చాడు గనుక ఆయనే స్వయంగా బాప్తిస్మ మియ్య నక్కరలేదు. వారిద్వారా ఆయన బాప్తిస్మ మిచ్చాడు. తరువాత, ఆయన దేవుని కుమారుడు గనుక స్వయంగా ఆయనే బాప్తిస్మ మిచ్చు చుండిన యెడల, క్రీస్తు మాత్రమే వారికి బాప్తిస్మ మియ్యాలని ప్రజలు భావించి యుందురు. ఇంకోమాటలో వారు విధేయత చూపించే బాప్తిస్మములోకన్నా వారికి బాప్తిస్మ మిచ్చే వ్యక్తిపై వారు ఎక్కువ ప్రాముఖ్యతను నిలిపి యుందురు. ఇతరులద్వారా పొందే బాప్తిస్మముకన్నా క్రీస్తుద్వారా స్వయంగా పొందే బాప్తిస్మము యొక్క విలువ ఎక్కువని వారు భావించి యుందురు. క్రీస్తే గనుక ఆయన దినాల్లో బాప్తిస్మ మిచ్చి యుంటే ఆయనచే బాప్తిస్మము పొందినవారు దేవుని కుమారునిచే బాప్తిస్మము పొందినవారమని గర్వించి యుండేవారు. గనుక బహుశ ఈ కారణాలను బట్టియు, ఇతర కారణాలను బట్టియు క్రీస్తు స్వయంగా బాప్తిస్మ మీయలేదు.

అయితే ఈరోజుల్లో మన సంగతి యేమిటి? యెవరు బాప్తిస్మ మియ్యాలి? ఉదాహరణకు భారతదేశంలో ఒక అలవాటు ఆరంభ మయ్యింది. స్థానిక సువార్తికులు పలుగ్రామాలకు వెళ్ళి సువార్తను

బోధించి అనేకమంది ప్రజలను సత్యము తట్టు మళ్ళించుదురు. గాని అమెరికా నుండి మిషనరీ సోదరులు వచ్చి వారికి బాప్తిస్మ మిచ్చునట్లు వారికి బాప్తిస్మము ఇయ్యకుండా కనిపెట్టుచుందురు. ఈ దురలవాటు 'బాప్తిస్మములను కూడగట్టే అలవాటని' పిలువబడుచున్నది. అయితే మనం చేయవలసినపని ఇదేనా ? ఇది బైబిలు బోధప్రకార మున్నదా ? నిజానికి అపొస్తలుల కార్యములలో మార్పుజెందిన వారి సందర్భాలు చూచుచున్నప్పుడు, ఎవరికైనా సత్యము బోధింప బడినప్పుడు, ప్రభువుకు విధేయత చూపించేంత మట్టుకు వారు వచ్చినప్పుడు వారికి తక్షణమే బాప్తిస్మ మియ్యబడింది. ప్రభువుకు నిజంగా లోబడుటకు వారు సిద్ధపడ్డారో లేదో పరీక్షించు నిమిత్తము వారేమి కనిపెట్టలేదు. ఏదో ఒక అపొస్తలుడు వచ్చేవరకు కనిపెట్టండి యని వారి కెన్నడు చెప్పబడలేదు. వారికి అట్టివి అనేక సంగతులు చెప్పబడలేదు గాని వారికి అప్పటికి అప్పుడే, తక్షణమే బాప్తిస్మ మియ్యబడింది. ఉదాహరణకు అపొ. కా. 8 లో సువార్తికుడైన ఫిలిప్పు ఇతియొపీయ నపుంసకునికి బోధించాడు. బాప్తిస్మము పొందుటద్వారా అతడు ప్రభువుకు విధేయు డవ్వగోరాడు. వారొక ఎడారి మార్గమున ప్రయాణము చేయుచున్నను, నీళ్ళున్న యొక చోటుకు రాగా ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చాడు. గనుక బైబిలు బోధను మనం అనుసరింప గోరుచున్నయెడల మనం కూడా అట్లే చేయాలి. అంటే బోధకులు సువార్త బోధించడానికి పట్టణాలకు, పల్లెలకు, గృహాలకు వెళ్ళినప్పుడు సువార్తను విని విశ్వసించి మారుమనస్సు పొంది క్రీస్తే దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందడానికి ఎవరైనా, లేక ఎంతమందైనా ఉన్నాసరే వారికి ఆ ఘడియలోనే వారు బాప్తిస్మమియ్యాలి.

స్థానిక ప్రజలు బాప్తిస్మము పొందాలంటే అమెరికానుండి ఎవరైనా 'దొర' లేక మిషనరీ వచ్చేవరకు కనిపెట్టాలని చెప్పే అల

వాటును సహోదరులారా, మనం ఖండించాలి. బాప్తిస్మం కొరకు ప్రజలు కనిపెట్టాలని అంటే వారి రక్షణ అంత ప్రాముఖ్యం కాదని, బాప్తిస్మం అంత ప్రాముఖ్యం కాదని మనం అంటున్నామన్నమాట. అంతేకాదు స్థానిక సువార్తికుడు అంత మంచివాడు కాడని, విదేశీయుని చేతిలో ఏదో ప్రత్యేక విలువ ఉన్నదని దాని యర్థము. ఇది కేవలము అయుక్తం, హాస్యాజనకం, లేఖన విరుద్ధం. అందువలనే కాబోలు సాధారణంగా స్థానిక ప్రజలు స్థానిక బోధకులను గౌరవించుట లేదు. ఈ అలవాటు వలన ప్రజలలో అహంభావము రేకెత్తుతాది. స్థానిక బోధకులచే బాప్తిస్మము పొందకుండా ఈ 'దొర' కొరకు ఆ 'దొర' కొరకు కనిపెట్టేలా ప్రజలను అది తయారుచేస్తాది. నేడున్న ఈ మన స్తత్వాన్ని బట్టి ఆనాడు క్రీస్తే గనుక స్వయంగా బాప్తిస్మమిచ్చియుంటే ప్రజలేమేమి చెప్పుకొనియుందురో ఆలోచించగలవా? ఏ అపొస్తలుడు కాదు, ఏ బోధకుడు కాదు, క్రీస్తే నాకు బాప్తిస్మమిచ్చాడని వారు డప్పాలు కొట్టుకొనియుందురు. మిగతావారి కంటే శ్రేష్టులమని వారనుకొనియుందురు. గాని ఆయన స్వయంగా ఎవరికీ బాప్తిస్మమియ్యక పోవుట వలన అట్టిది జరుగకుండా ఆయన దాన్ని ఆపుచేసాడు. ఆయనే బాప్తిస్మమియ్యనక్కర్లేదు. ఆ పనిని తన శిష్యులకాయన యిచ్చాడు. మనదేశానికి వచ్చే విదేశీ బోధకులెవరైనా సరే తనరాక కొరకు బాప్తిస్మములను కూడగట్టే అలవాటు గల స్థానిక బోధకులను ప్రోత్సహించకుండిన మేలు. బాప్తిస్మముల కొరకే భారత దేశానికి తరలుకొంటూ వచ్చే విదేశీ బోధకులను మనం ప్రోత్సహించకుండిన మేలు.

"స్థానిక బోధకులచేత బాప్తిస్మము పొందడానికి ప్రజలు నిరాకరించుచున్నారు" అని ఎవరైనా ఒకవేళ చెప్పవచ్చును. దీనికి ఒకే ఒక్క జవాబున్నది. ఆ ప్రజలు నిజంగా మార్పు జెందలేదు, అంతే! వారు నిజంగా మారితే, ప్రభువుకు తక్షణమే లోబడగోర్తారు. మా-

వులు ఒక విదేశీ 'దొరను' చూచి మార్పు జెందరాదు, గాని క్రీస్తును చూచి క్రీస్తువైపు మార్పు జెందాలి. అట్లయినప్పుడు నిజంగా వారు లోబడ్డారు. వారి రక్షణ వారికి బాప్తిస్మమిచ్చే వానిపై ఏ మాత్రము ఆధారపడి యుండలేదు గాని విధేయత చూపించు వారి విశ్వాసము లోనే యున్నది. దానిలో బాప్తిస్మమున్నది. గనుక విదేశీయులే అవు సరంలేదు. స్థానిక క్రైస్తవులెవరైనా సరే బాప్తిస్మమీయ వచ్చును.

బోధకుడవైన నా మిత్రుడా, నీవు వెళ్ళి సువార్త ప్రకటింపుము. ప్రభువుకు లోబడాలని కాంక్షించే ప్రజలున్న యెడల వెంటనే వారికి బాప్తిస్మమియ్యుము. ఎవడో ఒక విదేశీయుడు వచ్చేవరకు బాప్తిస్మము పొందకుండా వారు కనిపెట్టాలని తలంచెదవేమో జాగ్రత్త! విదేశీ బోధకుడెవరైనా వచ్చి తానే బాప్తిస్మ మియ్యాలని పట్టుపట్టుచున్న యెడల తప్పు అతనిదేగాని నీదికాదు. మిత్రుడా, నీవు సత్యాన్ని తెలిసి కొన్నట్లయితే ప్రభువుకు వెంటనే లోబడుము. ఏదో ఒక దొరగాని, ఇంకెవరైనా గాని వచ్చి నీకు బాప్తిస్మమియ్యాలని తలంచకుము. నిజ క్రైస్తవుడెవరైనా సరే నీకు ముంచడమియ్య వచ్చును. నీవు ప్రభువు నకు చూపించు విధేయతపైనే నీ రక్షణ ఆధారపడి యుండునని గ్రహించుము. నీవు సత్యాన్నెరిగి, దానికి విధేయత చూపించగోరినప్పుడు దాన్ని జరిగించుటకు వెంటనే చర్య తీసికొనుము.

మానవునిగాక క్రీస్తును వెంబడించేటట్లును, ఏదో ఒక బోధకుని అహంను సంతృప్తి పరచుటగాక క్రీస్తు బోధకుని వెనువెంటనే లోబడే టట్లును ప్రభువు మనకు సహాయం చేయునుగాక. దేవుని సత్యసువార్తను ప్రజలకు బోధించుటకు, విని విధేయత చూపించు వారికి బైబిలు బోధించుచున్నట్లు వెనువెంటనే బాప్తిస్మమిచ్చుటకు ప్రభువు మనకు సహాయం చేయునుగాక. మనం అట్లు చేయుటలో ఆత్మలు రక్షించ బడును. మన ప్రభువు ఘనపరచబడును.

క్రీస్తు పునరుత్థానము - 4

## క్రీస్తు మృతులలో నుండి లేచెను

గత కొద్ది సంచికలలో యేసుక్రీస్తు పునరుత్థానమును మనము పరిశోధించుచుంటిమి. ఏదైనా చారిత్రాత్మక ప్రతిపాదన యొక్క యథార్థతను మనము నిర్ణయించునపుడు సాధారణంగా సాక్షుల దృష్టాంతములే విలువైన ఆధారములై యుండును.

యేసుక్రీస్తు తిరిగి లేచిన తరువాత ఆయనను కంటితో చూచిన శిష్యులు లేకపోలేదు. 1 కొరింథీ 15వ అధ్యాయములో పౌలు క్రీస్తు పునరుత్థానమునుగూర్చి చెబుతూ, ఆయన మొదట కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని, అటుపిమ్మట అప్పటికి జీవించియున్న అయిదు వందల మందికిని కన్పడినట్లు చెప్పెను. వారందరిలో ఏ ఒక్కడైనను పౌలు చెప్పినది అసత్యమని ఖండించిన యెడల ఈ సమస్య అంతటితో తీరిపోయేది. ఆనాడు క్రీస్తు శత్రువులుగ పరిగణింపబడిన వారి మధ్య క్రీస్తు పునరుత్థాన వాస్తవాన్ని అపొస్తలులు ధైర్యంగా బోధించారు. ప్రజలు దాన్ని తిరస్కరించడానికి బదులు తండోపతండాలుగా క్రైస్తవులయ్యారు. ప్రజలలో అనేకులు, చివరకు యాజకులు కూడ క్రైస్తవులయ్యారు. క్రీస్తు మృతులలోనుండి లేవనియెడల అంతమంది క్రైస్తవు లెట్లయ్యారు?

## ప్రభువు దిన ప్రాముఖ్యత

యేసుక్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచినట్లు నిరూపించు అనేక సంగతులు కలవు. అట్టి వానిలో మొదటిది మన ప్రభువు దినమని పిలువబడు ఆదివారమే. చరిత్రలో ఏదైనా ఒక దినము కేటాయించబడిన యెడల అది ఒక గొప్ప సంగతిని సూచించును. దేవుడు ఏడవ దినమున తన పనినుండి విశ్రమించెను. గనుక దానిని పరిశుద్ధపరచి ప్రతిష్ఠించెను. దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి బయ

టకు రప్పించెను గనుక వారికి సబ్బాతు ననుగ్రహించెను. అట్లే ఆది వారమునకు ఒక ప్రాముఖ్యత లేనిదే దానిని క్రైస్తవులు ఆచరించుట కూడ ప్రయోజనము లేనిదగును.

అయితే ఆదివారమునకు గొప్ప ప్రాముఖ్యత నొసగునది క్రీస్తు పునరుత్థానము. పునరుత్థానమునకు ముందు ఆదివారము ప్రత్యేకముగ ఆచరింపబడలేదు. ఆ దినముననే క్రీస్తు మరణమునుండి సజీవుడై లేచి నట్లు లేఖనములు చెప్పుచున్నవి. ఆ తరువాత శిష్యులు ఆ దినముననే ఆరాధన కొరకు కూడుకొనినట్లు మనము చూడగలము. మొదట కొన్ని శతాబ్దములు యందంతట ఈ అలవాటు ఉన్నట్లు సంఘ తండ్రులు, చరిత్రకారులు చెప్పుచున్నారు. నేడు కూడ క్రైస్తవులు క్రీస్తు యొక్క పునరుత్థానమును గుర్తుంచుకొనుటకు ఆదివారమున కూడుకొనుటను మనము చూడగలము. క్రీస్తు మృతులలోనుండి లేపబడకను, ఆ దినమునకు ప్రాముఖ్యత కల్పించకను ఉండిన యెడల ఈ 20 శతాబ్దముల తరబడి ఆచరించబడిన దానినేమని చెప్పగలము?

## పునరుత్థాన సారూప్యమైన బాప్తిస్మము

బాప్తిస్మమను క్రియను తరువాత ఋజువుగ మేము చూపించు చున్నాము. ఆయన పరలోకమునకెక్కి పోవక ముందు యేసు తన శిష్యులకొక గొప్ప ఆజ్ఞనిచ్చెను. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15,16) రోమాలోని క్రైస్తవులను పౌలు ఇట్లు హెచ్చరించెను: "కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి ఏలాగు లేపబడెనో, ఆలాగే మనము నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమయిన యెడల ఆయన పున

రుత్థానముయొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగల వారమై యుందుము" (రోమా 6:4, 5). క్రీస్తుయేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానములకు బాప్తిస్మము సాదృశ్యముగ యున్నది. క్రీస్తు మరణించిన విధముగా ప్రతి మానవుడు తన పాపముల విషయమై మరణించవలెను అనగా మారుమనస్సు నొందవలెను. క్రీస్తు భూమిలో పాతిపెట్టబడెను. గాని బాప్తిస్మములో ప్రతి మానవుడు నీటిలో పాతిపెట్టబడవలెను. క్రీస్తు తిరిగి లేచిన రీతిగ బాప్తిస్మము అను ఈ నీటి సమాధినుండి ప్రతివాడు తిరిగి లేవవలయును. క్రీస్తు మృతులలోనుండి తిరిగి లేవని యెడల బాప్తిస్మమను క్రియలో కన్పడు పునరుత్థానమును గూర్చి యేమని మనము చెప్పుకొనగలము.

మానవుడు చిరకాలము జీవించాలి యనే కోరికగలవాడు. చావు అనిన భయపడువాడు మానవుడు. అనేక శతాబ్దముల వెనుక గోత్రికర్తయగు యోబు తన ఆశను ఈ విధముగా వెళ్ళబుచ్చాడు: "ఒక మానవుడు మృతినొందినయెడల అతడు తిరిగి బ్రతుకునా?" మానవుని ప్రకృతి అవసరములను తీర్చుటకు దేవుడు తగిన యేర్పాట్లు చేసాడు. సహజముగా నేను ఆకలిగొందును. ఆకలి దీర్చుకొనుటకు దేవుడు నాకు ఆహారము ననుగ్రహించాడు. నేను దప్పిగొందును, నా దప్పికము తీర్చుకొనుటకు దేవుడు నాకు నీరు ననుగ్రహించాడు. మరణానంతరము జీవించవలెనని నాకు ఆశ కలదు. క్రీస్తు యేసునందు నిత్యజీవము నొసగుటద్వారా దేవుడీ ఆశను తీర్చగలడనుట సమంజసము కాదా? క్రీస్తు పునరుత్థానమే మన పునరుత్థాన వాగ్దానము.

## మన పునరుత్థాన వాగ్దానము

"ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడి యున్నాడు. మనుష్యునిద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగు

ననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. ప్రతివాడును తన వరుస లోనే బ్రతికింపబడును; ప్రథమ ఫలము క్రీస్తు. తరువాత క్రీస్తు వచ్చి నపుడు ఆయనవారు బ్రతికింపబడుదురు." అని 1 కొరింథి 15:20-23 లో అపో. పౌలు వ్రాసెను. 1 థెస్స 4:13-17 లో అతడు మరల ఇట్లు వ్రాసెను: "సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖ పడకుండు నిమిత్తము నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియ కుండుట మా కిష్టములేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవు డాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువును బట్టి మీతో చెప్పున దేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచి యుండు మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూర తోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతు లైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతోకూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటల చేత ఒకనినొకడు ఆదరించుకొనుడి".

క్రీస్తు మృతులలోనుండి లేవనియెడల మానవుని నిరీక్షణ సమాధియొద్దనే అంతమగును. ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తు నందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరికంటె దౌర్భాగ్యు లమై యుందుము.

## బైబిలే ఒక గొప్ప ఋజువు

బైబిలు గ్రంథమునే మరొక ఋజువుగ మేము సమర్పించు చున్నాము. పునరుత్థానమును గూర్చి పాతనిబంధన భవిష్యత్తు చెప్పు చున్నది. క్రొత్త నిబంధన అది నెరవేర్చబడిన క్రియ యని చెప్పుచు

న్నది. క్రీస్తు పునరుత్థాన కాలమందే క్రొత్తనిబంధన వ్రాయబడెను. అది ఏ ప్రదేశమందు ఏ ప్రజలమధ్య జరిగెనో అక్కడే వ్రాయబడెను. క్రీస్తు శిష్యులు అసత్యమును బోధించినను, లేక లిఖించినను ఆ నాటి క్రీస్తు శత్రువులు వారి మాటలను సులభముగ తిరస్కరించియుందురు. అట్లు గాక పునరుత్థానము ప్రకటింపబడెను. అది గ్రంథములో వ్రాయబడెను. చివరకు క్రీస్తును చంపినవారి మధ్యనే క్రీస్తు సంఘము నిర్మింపబడెను. క్రైస్తవ వ్యతిరేకులు పునరుత్థాన యథార్థతల నంగీకరించి వారే పునరుత్థానమును ప్రకటింప మొదలిడిరి. అట్టివారిలో అపో.పౌలు ప్రథముడు.

క్రీస్తు పునరుత్థానమున కాధారమైయున్న బైబిలును నాశనము గావించుటకు ఎన్నో ప్రయత్నములు జరిగినను అది వాటన్నిటిని జయించి 19 వందల సంవత్సరములకు పైగా నిలిచియున్నది. దాని ప్రతులు వేలకు వేలు తగులబెట్టబడినవి. దానిని చదువుచున్న కారణముగ అనేక స్త్రీ పురుషులు కాల్చబడిరి. అనేక హతసాక్షుల రక్తముతో దాని పుటలు మరకలుబడినవి. అయినను ఇంతకు ముందెన్నడును లేనంత పెక్కు సంఖ్యలలో, భాషలలో అది ఈ నాడు లభించుచున్నది. బైబిలు బోధించు వర్తమానము సత్యము కానియెడల మానవాళిపై దాని ప్రభావము నెట్లు వర్ణింతుము?

## వాస్తవంగా సువార్తలోయున్నశక్తి

క్రీస్తు సువార్తను మరొక ఋజువుగ మీకు సమర్పించుచున్నాము. సువార్త యనగా క్రీస్తు లేఖనముల ప్రకారము మన పాపముల నిమిత్తము మృతి పొందెను. సమాధి చేయబడెను. మూడవ దినమున లేపబడెను అను వాస్తవములు (1 కొరింథి 15:3, 4). క్రొత్త నిబంధన ఏమియు వ్రాయబడకముందే ఈ వాస్తవములు ప్రకటింపబడెను. ఏ ప్రజలయితే క్రీస్తును సిలువవేసి చంపిరో, వారే వేలకు వేలు పునరుత్థానుడైన క్రీస్తునందు విశ్వసించి, బాప్తిస్మము పొంది

క్రైస్తవులయిరి. ఒకానొకప్పుడు క్రైస్తవులను హింసించిన పౌలు, "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి...రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" అని రోమా 1:16 లో ప్రకటించెను. పునరుత్థానమును గూర్చిన వర్తమానములో నేటి కింకను శక్తి యున్నది. ఈ నాడు కూడ సువార్తను నమ్మి బాప్తిస్మము పొంది వేలకొలది ప్రజలు క్రైస్తవులగుచున్నారు.

పునరుత్థానమును గూర్చిన ఋజువులను మీకు అనేకము సమర్పించితిమి. క్రీస్తు శత్రువులు ఆయన శరీరమును సమాధినుండి తీసుకొని పోలేదని మేము నిరూపించితిమి. శిష్యులు కూడ ఆయన శరీరమును దొంగిలించలేదని తేటపరచబడినది. మన యొద్దనున్న విస్తారమైన ఋజువులనుబట్టి క్రీస్తు మృతులలోనుండి లేచెనని మనము అంగీకరించవలసినదే. పునరుత్థానమునుబట్టి ఆయన దేవుని కుమారుడని ప్రభావముతో నిరూపించబడెను. అందుకే యేసు "నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవముగలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను"అనెను (యోహాను 5:24). మీరు నిత్యము జీవించాలని కోరుచున్న యెడల బాప్తిస్మము పొందుట ద్వారా క్రీస్తులోనికి ఇప్పుడే రండి!!

—జాషువా గూటం.

---

## శ్రేష్ఠమైన నామము
## *(That Worthy Name)*

యాకోబు వ్రాసిన రెండవ పత్రికను మనము చదివిన యెడల యాకోబు క్రీస్తునందుండి చెదిరిపోయియున్న తన సహోదరులయొక్క ఐక్యత కొరకు వ్రాసినట్లు మనము గమనించగలము.

"నా సహోదరులారా, మహిమాస్వరూపియగు మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన విశ్వాస విషయములో మోమాటము గలవారై యుండకుడి. ఏలాగనగా బంగారు ఉంగరము పెట్టుకొని ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన యొకడు మీ సమాజ మందిరములోనికి వచ్చినప్పుడు, మురికి బట్టలు కట్టుకొనిన దరిద్రుడును లోపలికి వచ్చిన యెడల మీరు ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన వానిని చూచి సన్మానించి – నీవిక్కడ మంచి స్థలమందు కూర్చుండుమని చెప్పి, ఆ దరిద్రునితో - నీవక్కడ నిలువుము, లేక ఇక్కడ నా పాదపీఠము నకు దిగువను కూర్చుండుమని చెప్పినయెడల, మీ మనస్సులలో భేదములు పెట్టుకొని మీరు దురాలోచనతో విమర్శ చేసినవారగుదురు కారా? నా ప్రియ సహోదరులారా, ఆలకించుడి. ఈ లోక విషయములో దరిద్రులైన వారిని విశ్వాసమందు భాగ్యవంతులుగాను, తన్ను ప్రేమించువారికి తాను వాగ్దానము చేసిన రాజ్యమునకు వారసులుగాను ఉండుటకు దేవుడేర్పరచుకొనలేదా? అయితే మీరు దరిద్రులను అవమానపరచుదురు. ధనవంతులు మీమీద కఠినముగా అధికారము చూపుదురు; మిమ్మును న్యాయసభలకు ఈడ్చుచున్న వారు వీరేగదా? మీకు పెట్టబడిన శ్రేష్ఠమైన నామమును దూషించు వారు వీరేగదా?" (యాకోబు 2:1-7).

దీనిని బట్టి ఋజువగుచున్న సత్యమేమనగా శిష్యులు, అపొస్తలులు జీవించుచున్న క్రొత్త నిబంధన కాలమందు క్రీస్తును అనుసరించు వారందరు ఒక ప్రత్యేక నామముతో పిలువబడిరి. అది ఒక శ్రేష్ఠమైన నామము, అది కొంతమందికి (ప్రత్యేకింప బడిన) వారికీయబడిన నామము. కాని ఆ నామము యొక్క మహత్తరశక్తిని, విలువను, ప్రాముఖ్యతను కలిగియున్న నామము. మరి అది ఏనామమై యుంటుంది? – మెథడిస్టు సంఘమా? బాప్టిస్టు సంఘమా? ఆంగ్లికన్ సంఘమా? లేక లూథరన్ సంఘమా? కేథలిక్ సంఘమా? లేక

ప్రొటెస్టాంట్ సంఘమా! కానేకాదు. దేవుడు తన స్వరక్త మిచ్చి కొనియున్న ప్రజలకు ఆయన యిచ్చిన నామముపైన పేర్కొన్న ఏ నామమును కాదు. ఏలయనగా ఈ నామములలో ఏ ఒక్కటియును అపొస్తలుల క్రొత్త నిబంధన కాలమందు యుండి యుండలేదు.

అపొస్తలుల కార్యములు పదకొండవ అధ్యాయములో ఈలాగున్నది. "అంతట బర్నబాసు సౌలును వెదకుటకు తార్సునకు వెళ్ళి అతనిని కనుగొని అంతియొకయకు తోడుకొని వచ్చెను. వారు కలసి యొక సంవత్సరమంతయు సంఘములో ఉండి బహుజనులకు వాక్యమును బోధించిరి. మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపొ. 11:25, 26). మరియు అదే గ్రంథమందు 26వ అధ్యాయమునందు అపొస్తలుడైన పౌలు అగ్రిప్పరాజుకు క్రీస్తును గురించి బోధించిన ఒక ఉదంతముకలదు. పౌలుచెప్పిన మాటలను చక్కగా వినిన రాజు — ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే అని పౌలుతో చెప్పెను (అపొ. 26:23). మరియు పేతురు వ్రాసిన మొదటిపత్రిక నాల్గవ అధ్యాయమునందు అపొస్తలుడైన పేతురు బోధించిన విధమును గమనించగలము "క్రీస్తు నామము నిమిత్తము మీరు నింద పాలైన యెడల మహిమా స్వరూపియైన ఆత్మ - అనగా దేవుని ఆత్మ, మీమీద నిలుచున్నాడు గనుక మీరు ధన్యులు. మీలో ఎవడైనను వరహంతకుడుగా గాని, దొంగగాని, దుర్మార్గుడుగా గాని, పరులజోలికి పోవువాడుగా గాని బాధ అనుభవించతగదు. ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (1 పేతురు 4:14-16).

కాబట్టి క్రొత్త నిబంధన కాలమందు శిష్యులు, మన రక్షకుడైన యేసుక్రీస్తు యొక్క అనుచరులు క్రైస్తవులు అను శ్రేష్ఠమైన నామముతోనే పిలువబడిరని నిస్సందేహముగా అర్థము చేసికొన

గలము. మరి నీవేమని పిలువ బడుచున్నావు? నీవు ఈరోజున ఆ శ్రేష్ఠమైన నామముతో పిలువబడుచున్నావా?

"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనతప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింప గలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడ నియ్యడు. అంతేకాదు, సహింప గలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించు కొను మార్గమును కలుగ జేయును" (1 కొరింథి 10:13).

మూలం :-సన్నీ డేవిడ్;

అనువాదం :- కె. రవీంద్రబాబు.

---

## 'నీవు దేవుని కుమారునియందు విశ్వాసముంచుచున్నావా'

(యోహాను 9 : 8)

"అందుకు వాడు ప్రభువా నేను ఆయనయందు విశ్వాసముంచు టకు ఆయన ఎవడని అడుగగా యేసు - నీవాయనను చూచుచున్నావు నీతో మాటలాడుచున్నవాడు ఆయనే అనెను. అంతట వాడు ప్రభువా నేను విశ్వసించుచున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను. అప్పుడు యేసు - చూడనివారు చూడవలెను. చూచువారు గ్రుడ్డివారు కావ లెను అను తీర్పు నిమిత్తము, నేనీ లోకమునకు వచ్చితినని చెప్పెను. ఆయనయొద్ద నున్న పరిసయ్యులలో కొందరు ఈ మాటలు విని మేమును గ్రుడ్డివారమా అని అడిగిరి. అందుకు యేసు మీరు గ్రుడ్డి వారైతే మీకు పాపము లేకపోవును గాని చూచుచున్నామని మీ రిప్పుడు చెప్పుకొనుచున్నారు గనుక మీ పాపము నిలిచియున్నదని చెప్పెను". యోహాను 9:35 to 41.

"లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. మీకు జీవము కలుగునట్లు మీరు నాయొద్దకు రానొల్లరు. నేను

మనుష్యుల వలన మహిమ పొందువాడను కాను". యోహాను 5:39 to 40.

"తరువాత తోమాను చూచి నీ వ్రేలు ఇటుచాచి నా చేతులు చూడుము. నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమనెను. అందుకు తోమా ఆయనతో - నాప్రభువా నాదేవా అనెను. యేసు - నీవు నన్ను చూచి నమ్మితివి చూడక నమ్మినవారు ధన్యులని అతనితో చెప్పెను". యోహాను 20:27 to 29.

ఈ లేఖన భాగములను చదువరులు గ్రహించవలెను. నేటి దినాలలో అనేకులు క్రీస్తు నామమును గాక వారివారి మత నామము లతో నిష్కపటులను మోసగించుచు ప్రజలను పెడదారి పట్టించు చున్నారు. లేఖనములనుగాని, దేవుని శక్తినిగాని యెరుగక పొరబడు చున్నారు. దేవుడు దర్శనమిస్తాడని, కలలో కనిపిస్తాడని మతనాయ కులును, బోధకులును ప్రజలను భ్రమపరచుచున్నారు. క్రొత్త నిబం ధన క్రైస్తవ్యమును మరియు ఆత్మలను రక్షించే శక్తిగల వాక్యమును సాత్వీకమైన మనస్సుతో అంగీకరించలేక పోవుచున్నారు. క్రొత్త నిబం ధనకు మధ్యవర్తియైన యేసుక్రీస్తు బోధలు విడిచి ముందుకు సాగు చున్నారు. పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడి దేవుని మూలముగ పలికిన ప్రవచనములను నిర్లక్ష్యము చేయుచున్నారు. నిత్యము జ్ఞాపకము చేసుకొనునట్లు జాగ్రత్తచేసిన లేఖనములను అనగా క్రొత్తనిబంధనను తిరస్కరించుచున్నారు. సత్యమునకు విరోధముగా అబద్ధ మాడు చున్నారు.

కాబట్టి ప్రియచదువరులారా సాతాను సమాజములైన డినామి నేషన్‌లను విడచి క్రీస్తు సువార్తయందు విశ్వాసముంచి మారుమనస్సు పొంది యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణము కొరకు క్రీస్తు నామమున బాప్తిస్మమును పొంది క్రీస్తు సంఘ సభ్యులు కావలెనని మిమ్మును ప్రోత్సహించుచున్నాను.

—R. సమూయేలు, అమలాపురం.

సంక్షిప్త ప్రసంగము :

# దేవుని హస్తము

## ( The Hand of God )

పరిచయము :

1. మన శరీరంలో ఆశ్చర్యకర మైనట్టియు, ఉపయోగకర మైనట్టియు అవయవం హస్తం !
2. ఆయా పనులు నేర్చుకొనడానికి, నైపుణ్యత సంపాదించడానికి మన చేతుల నుపయోగిస్తాం.
3. మన పనిలోను. సంభాషణలోను చేతుల నుపయోగిస్తాం.
4. చేతులద్వారా మన భావాలను, వ్యక్తిత్వాన్ని వ్యక్తపర్చుచుయుంటాము.

బైబిలు దేవుని హస్తాన్ని గూర్చి చెబుతుంది :

1. దేవుడు ఆత్మయై యున్నాడు. ఆయన వ్యక్తిత్వాన్ని గూర్చిన యథార్థతను మనకు తెలియజేయడానికి, మన వాడుక భాషనే బైబిలు ఉపయోగించుచున్నది.
2. అందువలన అది దేవుని హస్తాన్ని గూర్చి చెబుతుంది.
3. భూమిని సృష్టించి దానిపై జీవించుటకు మానవుని కలుగ జేసింది దేవుని చేతులే. యెషయా 45:12.
4. ఆయన తన గుప్పిలి విప్పి ప్రతిజీవి కోరికను తృప్తిపరచు చున్నాడు. కీర్తన 145:15, 16.
5. దేవుని పని జరిగించునట్లు మనలను బలపరచి, దీవించేది, సహాయమిచ్చేది దేవుని చెయ్యే. ఎజ్రా 7:9; నెహెమ్యా 2:8-18; కీర్తన 119:173; అపొ.కా. 11:21.
6. దేవుని బలమైన హస్తమే తన ప్రజలను బానిసత్వము నుండి విడిపించింది. (ద్వితీ 5:15). ఇప్పుడు దీనులను హెచ్చించేది కూడ ఆయన బాహువులే. 1 పేతురు 5:6.

7. తమ ఆలోచనల ననుసరించి చెడు మార్గమున నడుచుకొనుచు లోబడనొల్లని ప్రజలు మారుమనస్సు పొంది తిరిగి రావలెనని దేవుడే తన చేతులుచాచి పిలుచుచున్నాడు. యెషయా 65:2.

**ము గిం పు :**

అనిశ్చయం, భయం, ఆందోళనకరమైన సమయాల్లో దేవుని చేతులే మనలను నడుపునని గ్రహించుకొనుట ఆదరణకరం. యేసుప్రభువుద్వారా ఆయన యిచ్చే పిలుపును అందుకోవడం మనకు ధన్యకరం.
ఆయన చేతులు చాపి యున్నాడు. నీ చేతులు ఆయనతో కలుపు !!

— బిల్లీ రింగోల్డ్

---

## క్రీస్తును గూర్చి ఆయన సంఘాన్ని గూర్చి నీవు తెలుసుకోవలసిన సంగతులు

## *(Things you should know about Christ and His Church)*

A) 1. క్రీస్తు తన సంఘాన్ని కట్టాడు. దాన్ని తన స్వరక్తమిచ్చి కొన్నాడు. మత్తయి 16:18; అపో.కా. 20:28.

2. క్రీస్తు అనే పునాదిమీద అది కట్టబడింది. 1 కొరింథీ 3:11.

3. అది పౌలు, కేఫా, అపొల్లో అను వారిమీదగాని మరి యే మానవునిపైనగాని నిర్మించబడలేదు. 1 కొరింథీ 1:12-13.

4. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత పెంతెకొస్తునాడు అది సంపూర్తిగా స్థాపించబడింది. లూకా 24:49; అపో.కా. 1:8; మార్కు 9:1; అపో.కా. 2.

B) క్రొత్త నిబంధనలో సంఘము ఈ దిగువ పేర్లతో పిలువబడింది :

1. దేవుని ఆలయము. 1 కొరింథీ 3:16
2. క్రీస్తు వధువు. ఎఫెసీ 5:21-32
3. క్రీస్తు శరీరము. కొలస్స 1:24; ఎఫెసీ 1:22, 23.
4. దేవుని కుమారుని రాజ్యము. కొలస్స 1:13
5. దేవుని గృహము. 1 తిమో 3:15
6. సంఘము. ఎఫెసీ 3:10
7. దేవుని సంఘము. 1 కొరింథీ 1:2
8. క్రీస్తు సంఘములు. రోమా 16:16

C) సంఘ సభ్యులు ఈ దిగువ పేర్లతో పిలువబడ్డారు :

1. సభ్యులు లేక అవయవములు. 1 కొరింథీ 12:27
2. శిష్యులు. అపొ.కా. 6:1
3. విశ్వాసులు. అపొ.కా. 5:14; 2 కొరింథీ 6:15
4. పరిశుద్ధులు. అపొ.కా. 9:13; రోమా 1:7; ఫిలిప్పీ 1:1
5. యాజకులు. 1 పేతురు 2:9; ప్రక 1:6
6. పిల్లలు. 1 యోహాను 3:1, 2
7. క్రైస్తవులు. అపొ.కా. 11:26; 26:28; 1 పేతురు 4:16

D) సంఘములో మూడు రకములైన పరిచర్య చేయువారుందురు :

1. పెద్దలు. వీరే బిషప్పులని, ఓవర్ సీర్ లని, పాస్టర్లని కూడా పిలువబడ్డారు. మందను కాచి పోషించడమే వారి విధి. అపొ.కా. 20:28; 1 తిమో 3:1-7; తీతు 1:5-9; 1 పేతురు 5:1-4
2. పరిచారకులు. అపొ.కా. 6:1-6; 1 తిమో 3:8-13
3. సువార్తికులు. వీరు దేవుని వాక్యాన్ని బోధించి ఉపదేశింతురు. ఎఫెసీ 4:11; 1 తిమోతి, 2 తిమోతి, తీతు పత్రికలు.

E) మానవుడు సంఘాన్ని :

1. సంకల్పించలేదు. ఎఫెసీ 3:10-11
2. కొనలేదు. అపొ.కా. 20:28
3. నిర్మించలేదు. మత్త 16:18
4. దాని బోధను నెలకొల్పలేదు. 2 యోహాను:9, 10, గలతీ 1:11

F) క్రీస్తే తనకు తానుగా :

1. సంఘాన్ని ప్రేమించాడు. ఎఫెసీ 5:25
2. స్వరక్తమిచ్చి సంఘాన్ని కొన్నాడు. అపొ.కా. 20:28
3. సంఘాన్ని కట్టాడు. మత్తయి 16:18
4. సంఘము తనదన్నాడు. మత్తయి 16:18
5. రక్షింపబడినవారిని సంఘముతో చేర్చుతాడు. అపొ.కా.2:47
6. సంఘ శిరస్సై యున్నాడు. ఎఫెసీ 5:23, 4:4; 1:22, 23
7. సంఘాన్ని రక్షిస్తాడు. ఎఫెసీ 5:23; 4:4

G) సంఘములో ఈ దిగువ సంగతులున్నాయి :

1. విమోచన. ఎఫెసీ 1:7
2. పాపక్షమాపణ. కొలస్స 1:13, 14
3. పరిశుద్ధత. ఎఫెసీ 5:25
4. ఆత్మీయాశీర్వాదములన్నీ. ఎఫెసీ 1:3

H) సంఘములో ప్రవేశించాలంటే ఒకడు :

1. క్రీస్తునందు విశ్వసించాలి. యోహాను 8:24; అపొ.కా. 16:31; హెబ్రీ 11:6
2. పాపములవిషయమై మారుమనస్సు పొందాలి. లూకా 13:3; అపొ.కా. 2:38; 3:19; 17:30
3. క్రీస్తే దేవుని కుమారుడని ఒప్పుకోవాలి. మత్తయి 10:32, 33; రోమా 10:10; అపొ.కా. 8:37, 38

4. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందాలి. మత్తయి 28:19; మార్కు 16:16; అపొ.కా. 2:38; 1 పేతురు 3:21; గలతీ 3:27

I) క్రొత్త నిబంధన కాలంలో :

1. ఒకేఒక్క దేవుని గృహమున్నది. ఎఫెసీ 3:15
2. ఒకేఒక్క క్రీస్తు రాజ్యమున్నది. కొలస్స 1:13, 14
3. ఒకేఒక్క క్రీస్తు శరీరమున్నది. ఎఫెసీ 1:22, 23; 4:4
4. ఒకేఒక్క క్రీస్తు వధువున్నది. రోమా 7:1-7; ఎఫెసీ 5:22, 23
5. ఒకేఒక్క క్రీస్తు సంఘమున్నది. ఎఫెసీ 1:22, 23; 4:4

J) నమ్మకమైన క్రీస్తు సంఘము :

1. ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి. యోహాను 4:23, 24
2. ప్రతి ఆదివారమున కూడుకోనాలి. అపొ.కా. 20:7; హెబ్రీ 10 : 25
3. పాటలు పాడాలి; వాద్యములు వాయించరాదు. ఎఫెసీ 5:19; కొలస్స 3:16
4. ప్రార్థన చేయాలి. అపొ.కా. 2:42; 1 తిమో 2:1, 2
5. వాక్యోపదేశము చేయాలి. 1 కొరింథీ 14:15-27
6. ప్రతి ఆదివారమున ప్రభు రాత్రి భోజనంలో పాల్గొనాలి. అపొ.కా. 20:7; 1 కొరింథీ 11:20-32
7. అభివృద్ధి జెందినకొలది కానుకల నీయాలి. 1 కొరింథీ 16:1, 2; 2 కొరింథీ 9:7.

K) ప్రతి స్థానిక సంఘము :

1. సువార్తను ప్రకటించాలి. 2 తిమో 4:1-7
2. ఉపదేశించాలి. 1 తిమో 3:1-2; మత్తయి 28:18-20

3. రోగులను దర్శించాలి. మత్తయి 25:34-40
4. అనాథలను, విధవరాండ్రను పరామర్శించాలి. యాకోబు 1:27

L) బైబిలులో కనబడే క్రీస్తు సంఘము :

1. ఈనాడు మీ పూరిలోకూడా నెలకొల్పుట సాధ్యమే.
2. ఏవిధంగా కూడా ఒక డినామినేషన్ కాదు.
3. దేవుని వాక్యానికి నమ్మకముగా యున్నది.
4. సువార్తకు లోబడే వారిద్వారా సభ్యులను సంపాదించు కొంటాది.
5. సంఘానికి సభ్యులకు బైబిలు పేర్లనే కలిగియున్నది.

నీవింకా క్రీస్తు సంఘ సభ్యుడవు కానియెడల ప్రభువులోనికి, ఆయన సంఘములోనికి వచ్చుటకు త్వరపడుము. పైనచెప్పిన అంశము లన్నిటిని మీ బైబిలు తెరచి పరిశోధించ మనవి. సత్యాన్ని గ్రహించి దానికి లోబడుటకు వెనుకాడవద్దు !!

## ప్రభువుకు లోబడుట
## (Obedience to the Lord)

మానవునియొక్క ఆదినుండి దేవుడతనినుండి విధేయతకోరాడు. మానవుని అవిధేయతవలననే అతడు దేవుని పరదైసునుండి బయటికి నెట్టివేయబడ్డాడు. సీనాయి కొండమీద ధర్మశాస్త్రము మీయబడక ముందే గోత్రికర్తలగు అబ్రహాము, ఇస్సాకు, యాకోబులనుండి, వారి సంతతినుండి దేవుడు హృదయపూర్వకమైన విధేయతను కోరాడు.

మనము పాతనిబంధనను చదువునప్పుడు ధర్మశాస్త్రములో ఆదినుండి అంతమువరకు దేవుడు విధేయత నాశించినట్లు చూడగలము. తన ప్రజలాయనకు విధేయులైనప్పుడు ఆయన వారి నాశీర్వదించాడు, అవిధేయులైనప్పుడు శిక్షించాడు.

దేవుడు మానవులనుండి విధేయత కోరుట లేనట్లుగా ఇప్పుడు ఆయన మానవులతో సంప్రదించుచున్నాడా ? ఆయన ఇప్పుడు విధేయతను కోరుటలేదని బోధించేవారున్నారు. అయితే దేవుని గ్రంథ మేమి చెప్పుచున్నది ?

యేసుప్రభువు తనకు విధేయులైన వారందరికి నిత్య రక్షణకు కర్తయై యున్నాడు (హెబ్రీ 5:9). ఆయనకు లోబడుటకు నిరాకరించు వారిని ఆయన రక్షించునా ? దేవుని వాక్యము, రక్షణ సువార్త యెరూషలేములో బోధింపబడగా శిష్యుల సంఖ్య బహుగా విస్తరించింది; మరియు యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి (అపో. కా. 6:7). ఈ యాజకులు ఎప్పుడు రక్షింపబడ్డారు ? విధేయతకు ముందా ? లేక దాని తరువాతా ?

రోమీయులకు వ్రాస్తూ అపో. పౌలు, "మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయపూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి" యని వారికి జ్ఞాపకం చేసాడు (రోమా 6:17). రోమా 6:16 ను కూడ మనం గమనించినట్లయితే ఈ జీవితంలో మనం దేనికో దానికి నీతికో లేక పాపానికో విధేయులమై యుంటామని తెలుసుకోగలం.

పరలోకమందున్న తండ్రి చిత్తాన్ని జరిగించుచు ఎవడు ఉంటాడో వాడు పరలోకానందాన్ని అనుభవిస్తాడు (మత్తయి 7:21). దేవుని సువార్తకు లోబడనివారు భక్తిహీనులు, పాపులై యుంటారని, వారికే శిక్ష విధించబడతాదని పేతురు విశదపర్చుచున్నాడు (1 పేతురు 4:17, 18). యిది అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమగు నిత్య నాశనమనే దండన యని పౌలు వర్ణించుచున్నాడు (2 థెస్స 1:7-10). ఈ శిక్ష యెవరికి ! యెవరైతే సువార్తకు లోబడరో వారికి !

యేసుప్రభువు దేవుని కుమారుడని నమ్మి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందు, నీ విశ్వాసాన్ని ఒప్పుకో, పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందు (అపొ.కా. 2:36-38). దయచేసి ఈరోజే సువార్తకు లొంగుము; రేపటికి వాయిదా వెయ్యొద్దు!!

— D. లిండెల్.

## దేవుడు లేడా?

దేవుడు లేడనువారు బుద్ధిహీనులని బైబిలు చెప్పుచున్నది. ఇవి మా మాటలు కాదు. దైవగ్రంథమే ఆ విధముగ తీర్పు తీర్చింది. కీర్త 14:1. సృష్టి వెనుక ఒక శక్తి ఉన్నదని మేము నమ్ముచున్నాము. భూమి తనచుట్టు తాను తిరుగుచు నిర్ణీత కక్ష్యలో ఏ ప్రమాదము లేకుండ పరిభ్రమించునట్లు దానిని శాసించినవాడు దేవుడని మేము నమ్ముచున్నాము.

కొందరు శాస్త్రజ్ఞులు 1982వ సంవత్సరములో నవగ్రహములు ఒకే సరళ రేఖలో నిలుచునని, ఈ గ్రహకూటమివలన భూమియొక్క చలనగతిలో మార్పు వచ్చునని, యితర గ్రహములయొక్క ప్రభావము భూమిపై పడునని దీనివలన భూకంపములు మొదలగు ప్రకృతి వైపరీత్యములు సంభవించునని చెప్పి ప్రపంచమును కలవరపెట్టిరి. ఇది మానవుడు ఊహించిన విషయము మాత్రమే. మనము గ్రహించవలసిన విషయమేమనగా, గ్రహములన్నియు నిర్ణీత క్రమములో చలించునట్లు దేవుడు వాటికి హద్దులను ఏర్పాటుచేసాడు. అందువలననే 1982వ సంవత్సరము ప్రశాంతముగ గడిచిపోయింది.

నాస్తిక మిత్రులు భూమి అందలి సృష్టి, విశ్వము దానికదే 'ప్రేలుడు' సంభవించుటద్వారా కలిగెనని నమ్ముచున్నారు. ఏకకణ జీవులు, కీటకములు, పక్షులు, జలచరములు, యిందలి రకములన్నియు

వాటికవే పుట్టెనని లేక పరిణామము చెందెనని నమ్ముచున్నారు. ఈ పరిణామ సిద్ధాంతము నిరూపింపబడలేదని అనేకమంది శాస్త్రజ్ఞులు చెప్పిన సాక్ష్యములు, అభిప్రాయములు మేము భద్రము చేసితిమి. దేవుడున్నాడని పదివేల ఋజువులు మీముందుంచగలము. ఒక గొంగళి పురుగు సీతాకోక చిలుకగా మారుట, మన శరీర అవయవ నిర్మాణము, పరమాణువులో నుండు శక్తి, వృక్షములకు కావలసిన బొగ్గుపులుసు వాయువును మానవుడు, మానవునికి కావలసిన ప్రాణవాయువును వృక్షములు పరస్పరము అందించుకొనుట, యివన్నియు దేవుడున్నాడనుటకు ఋజువులే.

భూగోళము అన్ని విషయములలోను నరులకు నివాసయోగ్యముగా ఉన్నది. మిగిలిన గ్రహములు అట్టి విధములుగ లేవు. మానవునికి కలిగిన ఈ మేలులు అదృష్టవశాత్తు వచ్చెనా? ప్రియ నాస్తిక మిత్రుడా, దేవుడు లేడనుటకు ఒక్క ఋజువైనను చూపగలవా? ఒకవేళ నీవు పనికిమాలిన పరిణామ సిద్ధాంతమును తీసికొని వచ్చినచో, అది 1859వ సంవత్సరములో ఛార్లెస్ డార్విన్ అను ఒక మనుష్యుని యొక్క గ్రంధరూపము దాల్చిన ఆలోచన యని గుర్తుంచుకొనుము. యిప్పుడు భిన్నత్వము కలిగిన పరిణామ సిద్ధాంతము లనేకములున్నవి. ఏ సిద్ధాంతమును పట్టుకొని ఇది ఖచ్చితమని నీవు తీసికొని రాగలవు?

దేవు డెక్కడనుండి వచ్చెనని నీవు అడుగవచ్చును. "నీవు ఎక్కడనుండి వచ్చితివని" అడిగినయెడల నీ జవాబేమి? "నేనే మొదటివాడను, కడపటివాడను, ఆదియు అంతమునై యున్నానని" ప్రభువు చెప్పాడు. ప్రక 22:13.

దేవుడున్నాడని చెప్పుటకు అనేక బలమైన ఆధారములున్నవి. నీవు ఆయనను చూడలేవు. తాకలేవు. ఏ కొలతతోను ఆయనను కొలవలేవు. సృష్టిని జాగ్రత్తగా పరిశీలించినయెడల సృష్టికర్త ఎంతటి శక్తిమంతుడో అర్థమగును. "గడ్డినిపోలిన మనకు (1 పేతు 1:24) కొంత

పు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటి మనకు (యాకో :14) సర్వశక్తిమంతుడైన దేవుని విమర్శించుటకు అర్హత లేదు.

నీవు ఎన్ని పరిశోధనలు జరిపినను వృద్ధాప్యము, మరణము మొదలగు వాటిని జయించలేవు. దేవుడు వాటిని నియమించాడు. దేవుడు నియమించిన వీటిని నీవు జయించగలవా? లేనప్పుడు మిత్రుడా, దేవుని విమర్శించు హక్కు నీకు లేదు.

"సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వముగలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, చూడనేరడు" (1 తిమో 6:16). "ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు" (అ.కా. 17:25). "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు." (కొలస్స 1:17).

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---


## మీకొక మంచి తరుణము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొందియున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలో మేము ప్రచురించుచున్న సత్యవాక్కు మాస పత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYAVANI**
(P.O. Box 80) Seshagiri Rao Street
KAKINADA - 533 004

# బైబిలు

మానవు లేమి ఊహించుదురో దాన్నిగూర్చి యితర గ్రం
ములు మనకు చెప్పునుగాని దేవుడెరిగిన దాన్ని బైబిలు చెప్పును. ఇత
గ్రంథాల్లో మనవలె అజ్ఞానులైన మానవుల మనోభావాలు కన్పడును
సమస్తమును చేసిన నిత్యజ్ఞాని యగు దేవుడు సమగాని స్త్రా
ఎరిగియుండి మనకు బయలుపరచిన వాటిని గూర్చి బైబిలు చెబుతుంది.

ఈ గ్రంథము మానవులను జ్ఞానులుగ చేస్తుంది. అది నిత్యరక్షణ
నొసగు జ్ఞానము. దీన్ని సరిగ చదివినవాడు ఎంత అజ్ఞానుడైనను అది
నిత్యరక్షణను గూర్చి అందించు పరిశుద్ధమైన జ్ఞానాన్ని పొందకుండ
యుండలేడు.

దేవునితోను ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతోను మనలను
సహవాసపరచే శక్తి మరింకో గ్రంథానికి లేదు. నిత్యజీవానికి మార్గం
చూపే ఈ గ్రంథాన్ని చదువండి. లోపల నాటబడి మీ ఆత్మలను
రక్షించుటకు శక్తిగల వాక్యాన్ని సాత్వికంతో అంగీకరించండి
(యాకోబు 1:21). దాని అనుభవాన్ని మీరే స్వయంగా పొందండి.

---

Regd. No. H/KD-...

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................

..............................

..............................

..............................